క్లుప్తంగా

పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం



వేలేరు : పూడ్చిన మృతదేహానికి పోస్టుమార్టం చేసిన సంఘటన పీచర శివారు వావిళ్లకుంట తండలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై కథనం ప్రకారం.. వావిళ్లకుంట తండకు చెందిన బానోతు శిరీష (22) హనుమకొండలోని ఎస్టీ హాస్టల్‌లో ఉంటూ కేడీసీ డీగ్రీ కళాశాలలో బీ.ఏ ద్వితీయ సంవత్సరం చదువుతుంది. కళాశాలకు సెలవులు కావడంతో గత నెల 24వ తేదీ సాయంత్రం యువతి తండ్రి నారాయణ హాస్టల్‌కు వెళ్లి ఇంటికి తీసుకువచ్చాడు. మరునాడు ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో శిరీష గడ్డిమందు తాగింది. గమనించిన చుట్టుపక్కలవారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో చికిత్స నిమిత్తం ములుకనూరు లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే ఆమె మృతిచెందింది.

సుమోటోగా కేసు నమోదు..

మృతురాలి తల్లిదండ్రులు ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయలేదు. అదే రోజు ఇంటికి తీసుకువచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. ఈ విషయాన్ని గ్రామస్తుల ద్వారా ఆలస్యంగా తెలుసుకున్న పోలీసులూ.. సూమోటోగా కేసు నమోదు చేసి శిరీష సమాధి వద్దకు తహసీల్దార్ హెచ్.కోమి ఆధ్వర్యంలో పంచనామా నిర్వహించారు. సాక్షుల సమక్షంలో వీడియో రికారింగ్ చేస్తూ పోస్టుమార్టం నిర్వహించినట్లు ఎస్సై పేర్కొన్నారు. కాజీపేట ఏసీపీ పి.తిరుమల్, ధర్మసాగర్ సీఐ మహేందర్, వైద్యాధికారులు తదితరలు పాల్గొన్నారు.

కిడ్నాప్ కేసులో ఐదుగురి అరెస్ట్

పరకాల : ఓ బేకరి వ్యాపారి వద్ద తీసుకున్న డబ్బులు తిరిగి చెల్లించకపోవడంతో వలిపిరెడ్డి మదుసూధన్‌ను బలవంతంగా కారులో ఎక్కించుకొని.. బెదిరించి బలవంతంగా ప్రామిసరీ నోటు రాయించి సంతకాలు చేయించిన ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు పరకాల సీఐ డి.రవిరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పరకాలకు చెందిన వలిపిరెడ్డి మదుసూదన్ అతడి ఇంటికి ఎదురుగా ఉన్న చెనుమల్ల సమ్మయ్య వద్ద 2009 నుంచి వ్యాపార అవసరాల నిమిత్తం అప్పు చేస్తూ వచ్చాడు. 2016 సంవత్సరానికి గాను రూ.10 లక్షల అసలు అప్పుగా ప్రామిసరీ నోటు రాసుకున్నారు. అప్పటి నుంచి అసలు, వడ్డీ ఇవ్వకుండా కాలయాపన చేస్తున్న మదుసూధన్‌ను డబ్బులివ్వాలని సమ్మయ్య ఒత్తిడి చేశాడు. ఎంతకూ డబ్బులివ్వకపోవడంతో సమ్మయ్య పరకాలలో రిపోర్టర్‌గా పని చేస్తున్న కానుగంటి కరుణాకర్‌ను సంప్రదించాడు. మదుసూదన్ నుంచి డబ్బులిప్పిస్తే రూ.50 వేలు ఇవ్వాలన్న ఒప్పందంతో కరుణాకర్ స్థానికులైన మేకల దిలీప్, బొచ్చు రమేష్, దండ్రె వెంకటేశ్‌తో కలిసి ఈ నెల 22న మధుసూదన్ పనిచేసే దుకాణం వద్దకు వెళ్లి అతడిని బలవంతంగా కారులో ఎక్కించుకొని చౌటుపర్తి గుట్టల వద్దకు తీసుకెళ్లారు. అక్కడ బలవంతంగా రూ.28 లక్షలకు ప్రామిసరీ నోట్ రాయించుకుని సంతకాలు చేయించుకున్నారు. రెండు గంటల పాటు కారులో తిప్పించుకున్న అనంతరం అంబేడ్కర్ కూడలిలో వదిలేసి వెళ్లిపోయారు. ఇదే విషయమై మధుసూదన్ భార్య సుగుణ పరకాల పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ రవిరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించగా.. నిందితులు పరకాల బస్టాండ్ వద్ద కారులో వెళ్తుండగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారిలో రేగొండ మండలం రూపిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన కానుగంటి కరుణాకర్, మల్లారెడ్డిపల్లెకు చెందిన మేకల దిలీప్, సీఎస్ఐ కాలనీకి చెందిన బొచ్చు రమేష్, బేకరి వ్యాపారస్తులు చెనుమల్ల సమ్మయ్య, చెనుమల్ల అనిల్ ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితులు వాడిన ఎర్టిగా కారు(టీఎస్02యూఈ0561)తో పాటు ప్రామిసరీ నోటును స్వాధీనం చేసుకున్నారు. రిమాండ్ నిమిత్తం పరకాల కోర్టుల హాజరుపర్చినట్లు సీఐ రవిరాజు తెలిపారు.

ఇద్దరికి గాయాలు

మడికొండ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన మడికొండలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మడికొండకు చెందిన ఆటోడ్రైవర్ ధర్మసాగర్ రోడ్డు వద్ద పెట్రోల్ నింపుకొని మడికొండ చౌరస్తా వైపు వస్తుండగా అశ్విని సీడ్స్ షాపు వద్ద మిల్క్‌వ్యాన్ ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటోడ్రైవర్‌కు తలకు, వెనుక కూర్చున్న మరో వ్యక్తికి కాలుకు, తలకు బలమైన గాయమైనట్లు తెలిపారు. చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. మడికొండ పోలీసులను వివరాలు అడుగగా మాకు ఎలాంటి సమాచారం రాలేదని పేర్కొన్నారు.

అక్రమ మద్యం రవాణాచేస్తే చర్యలు

కాజీపేట అర్బన్ : ఎన్నికల నియమావళికి విరుద్ధంగా మద్యం రవాణా, నిల్వలు చేపట్టిన చర్యలు తప్పవని హనుమకొండ ఎక్సైజ్ సీఐ దుర్గా భవాని తెలిపారు. హన్మకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని వడ్డెపల్లి, కేయూసీ క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు పెట్రోలింగ్ నిర్వహించారు.

‘పది’లో మెరిసిన ఆణిముత్యాలు

- జీపీఏ సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు
- వందశాతం ఉత్తీర్ణతతో నిలిచిన పలు స్కూళ్లు

ఎల్కతుర్తి : రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం విడుదలైన పదోతరగతి వార్షిక పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యారాణి తెలిపారు. ఇందులో ఎమ్.ప్రవళిక 9.7, కె.ప్రీతి 9.5, కె.అంజిరాణి 9.5 సాధించినట్లు వెల్లడించారు. అలాగే మోడల్‌స్కూల్ 96శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సునీత పేర్కొన్నారు. గుడెల్లి లక్ష్మీప్రసన్న 9.2 సాధించగా కడారి సాత్విక్ 9.0 సాధించినట్లు పేర్కొన్నారు. కేజీబీవీలో 92.3శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అనితాదేవి తెలిపారు. భీమదేవరపల్లి మండలం వంగర టీఎస్ఆర్అండ్‌జేసి పాఠశాలలో 72మంది విద్యార్థులకు 72మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ సురేఖ తెలిపారు. ఆర్.వర్షిత 9.7, జీ.తరుణిక 9.5, ఎస్.సిద్ధు 9.5. వై.ప్రసన్న 9.5, ఏ.సానాళిక 9.5, పీ.నందిని 9.5, బీ.శ్రీవల్లి 9.5 సాధించినట్లు వెల్లడించారు. అలాగే మోడల్‌స్కూల్‌లో 87మంది విద్యార్థులకు 86మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కుమార్ పేర్కొన్నారు. ఏ.స్పందన, జీ.సంజన 9.3 పాయింట్లు సాధించారు.

శాయంపేటలో..

శాయంపేట : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు జీపీఏ సాధించి సత్తా చాటినట్లు ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఎం.సంజయ్‌సాహిత్, ఎం.నాగచైతన్య, ఎం గుణశేఖర్ జీపీఏ సాధించగా మరో 7గురు విద్యార్థులు 9.8 సాధించినట్లు తెలిపారు. పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో 65 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సుభాషిణి దేవి తెలిపారు. బోడ లావణ్య 9.7 సాధించగా మరో 14మంది 9 పాయింట్లు సాధించినట్లు తెలిపారు. కస్తూరిభా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో 34 మంది విద్యార్థులకు 29మంది ఉత్తీర్ణత సాధించినట్లు స్పెషల్ ఆఫీసర్ మాధవి తెలిపారు. ఎం.శిరిష, జి సౌమ్య 8.5 సాధించినట్లు తెలిపారు. మండలంలోని పెద్దకోడెపాక, గంగిరేణిగూడెం, పత్తిపాక, కాట్రపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీఎస్ఐ, మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ పేర్కొన్నారు.

దామెరలో..

దామెర : మండలంలోని ల్యాదెళ్లలో గల వికాస్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ ఎండీ. అక్బర్ మంగళవారం తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం. నాగశ్రీ, ఎస్.అచ్యుత్ జీపీఏ సాధించినట్లు పేర్కొన్నారు. అదే విధంగా పాఠశాల 100 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే ఒగ్లాపూర్‌లో గల మహాత్మాజ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలకు చెందిన 73 మంది విద్యార్థులు పరీక్ష రాయగా 72 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రాధానోపాధ్యాయుడు యాదగిరి తెలిపారు. ఇటుకాల సాకేత్ జీపీఏ సాధించగా ఇద్దరు విద్యార్థులు 9.8, సాధించినట్లు తెలిపారు. మరో 37 మంది విద్యార్థులు 9.0 సాధించినట్లు పేర్కొన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాలలో సిహెచ్ నాగచైతన్య జీపీఏ సాధించాడు.

నడికూడలో..

నడికూడ : పదోతరగతి పరీక్షల ఫలితాల్లో మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థిని మామిడి ఇందు 9.5 సాధించి మండల టాపర్‌గా నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు తెలిపారు. మండలంలోని 7 ఉన్నత పాఠశాలల నుంచి 78 మంది పరీక్షలు రాయగా 71 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. రాయపర్తి ,నార్లాపూర్ పాఠశాలలు 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు మంగళవారం విడుదలైన పదోతరగతి పరీక్ష ఫలితాల్లో సత్తా చాటారు. ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన ఎ.అక్షయ, ఎస్.శ్రీచరణి, పి.స్వాతి, టి.రిషిక 9.7 సాధించారు. ఎంజేపీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన ఎ.కార్తీక్, ఎ.రోహిత్, ఎం.సాయి హర్షిత్, ఎస్.సాయికుమార్, ఒ.చరణ్‌తేజ, పి.నందు, కేజీబీవీకి చెందిన నరిగె శైలజ, తెలంగాణ మోడల్ స్కూల్ విద్యార్థిని కె.నిఖిల 9.5 సాధించారు. మర్రిపల్లిగూడెం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని పి.సంజన 9.3, శనిగరం జెడ్పీహెచ్ఎస్ విద్యార్థినులు ఎం.వర్షిణి, ఎం.సిరి, టీఎస్ఎంఎస్ విద్యార్థులు జె.మణిదీప్ 9.2, పి.రాంచరణ్, వి.వరుణ్, కేజీబీవీ విద్యార్థినులు కడారి అస్మిత 9.0 సాధించారు. మండల కేంద్రంలోని విశ్వభారతి హైస్కూల్ విద్యార్థి బోయిని వరుణ్‌తేజ 9.8 సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. మర్రిపల్లిగూడెంలోని కాకతీయ విద్యాలయం విద్యార్థి కొత్తకొండ రుషిరాజ్ 9.5, కేరళ మోడల్ స్కూల్ విద్యార్థి నాగుల రిత్విక్, అంబాలలోని సాకేత హైస్కూల్ విద్యార్థిని ఎ.మేఘన 9.3 సాధించారు. మండల వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 613 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా 91.84 శాతంతో 563 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ ఈ.రాంకిషన్‌రాజు తెలిపారు. అలాగే మండలంలోని భీంపల్లి, మాదన్నపేట, మర్రిపల్లిగూడెం, శనిగరం, శ్రీరాములపల్లి, వంగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు రెండు ప్రైవేట్ పాఠశాలలు, కేరళ మోడల్ సూకల్, శనిగరంలోని శ్రీ చైతన్య హైస్కూల్ పదోతరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి.

వేలేరులో..

వేలేరు : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతీభ కనబరిచారు. మండల వ్యాప్తంగా 226 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 207మంది ఉత్తీర్ణత సాధించినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన పి.సాహిత్య, పి.సాహితి, గురుకుల విద్యార్థులు వరుణ్ సందేష్, కిరణ్, సంజయ్ 9.7 సాధించి మండల టాపర్లుగా నిలిచినట్లు విద్యాశాఖ అధికారులు తెలిపారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : పదోతరగతి ఫలితాల్లో గుడెప్పాడ్‌లో కొనసాగుతున్న పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు ఎం.సావిత్రి 9.8, పి.అంజలి 9.8, బి.భావన 9.8 సాధించినట్లు ప్రిన్సిపాల్ స్టెల్లా తెలిపారు. కేజీబీవీలో బండి సహస్ర 9.8, పి. స్వాతి 9.5, జి.జ్యోతిర్మయి 9.5 సాధించారని ఆ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ వాసవి పేర్కొన్నారు. అలాగే అగ్రంపహాడ్ విశ్వభారతి హై స్కూల్ విద్యార్థిని ఆర్.మేఘన జీపీఏ సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ రమేశ్ తెలిపారు. మండల కేంద్రంలోని స్పెక్ట్రా పాఠశాలతో పాటు మండలంలోని జెడ్పీ హైస్కూల్ 100 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

పరకాలలో..

పరకాల : పదోతరగతి పరీక్ష ఫలితాల్లో పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు తెలిపారు. 65 మంది విద్యార్థులకు 63 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. సోల్లేటి శివప్రసాద్ 9.5, దొల్లా బాజీ హాసిని 9.2, గువ్వా సుష్మిమ 9.2, దుంపేటి వంశీకృష్ణ, దొనికెల స్వాతి 9.0 సాధించగా 23 మంది విద్యార్థులు 8.0 సాధించినట్లు తెలిపారు.

ఐనవోలులో..

ఐనవోలు : మండలంలోని అన్ని యాజమాన్యాల పాఠశాలల నుంచి 338 మంది విద్యార్థులు పదోతరగతి పరీక్షలు రాయగా 327 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. జెడ్పీహెచ్ఎస్ వెంకటాపూర్, ఒంటిమామిడిపల్లి, సింగారం, సెయింట్ ఆన్స్ ఎయిడెడ్, ఎంజేపీతో పాటు కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో నూరుశాతం ఫలితాలు సాధించినట్లు తెలిపారు. ఎంజేపీ విద్యార్థి శ్రీతేజ్ జీపీఏ సాధించగా, ఒంటిమామిడిపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో కిరణ్ 9.8, కేజీబీవిలో మోక్షిత 9.7 సాధించినట్లు ఈ ఈ సందర్భంగా పేర్కొన్నారు.



ఎం. నాగశ్రీ, శ్రీతేజ్, అచ్యుత్, సంజయ్, గుణశేఖర్, ప్రీతి, అంజలి, భావన, శ్రీచరణి, ఇందు, సావిత్రి, నాగ చైతన్య, ప్రవళిక, ప్రణీత్, స్వాతి, నిఖిల



రిషిక, శైలజ

ప్రతీ గ్రామానికి సాగు, తాగు నీరందిస్తాం

- పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించండి
- మంత్రి పొన్నం ప్రభాకర్
- ముల్కనూరులో రోడ్ షో

ఎల్కతుర్తి: ‘పార్లమెంట్ అభ్యర్థి రాజేందర్‌రావును గెలిపించండి. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేస్తాం. మెట్ట ప్రాంతమైన హుస్నాబాద్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి తాగు, సాగునీరుందిస్తాం’ అని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. మంగళవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుతో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈసందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. బీజేపీ నాయకులు ఆయోధ్య రాముడి పేరు చెప్పి ఓట్లు అడగడం సమంజసం కాదన్నారు. గ్రామాల్లో గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తప్పితే బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీల్లో ఇప్పటికే సగం అమలు చేసిందన్నారు. మిగతావి రెండో విడతలో మంజూరు చేస్తామన్నారు. దేవాదుల కాలువలకు మరమ్మతులు చేయించి భీమదేవరపల్లి మండలానికి సాగు నీరందస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం బీఆర్ఎస్ నుంచి పలువురు నాయకులు కాంగ్రెస్‌లో చేరగా.. వారికి మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు కొలుగూరి రాజు, ఆదరి రవీందర్, చిదురాల స్వరూప, కర్ణకంటి మంజులారెడ్డి, చిట్టంపల్లి అయిలయ్య, ప్రకాశ్, మీస మహేశ్, చంద్రశేఖర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.



రోడ్ షోలో మాట్లాడుతున్న మంత్రి ప్రభాకర్‌గౌడ్

నేడు బాక్సింగ్, అథ్లెటిక్స్‌ల్లో ఎంపికలు

వరంగల్ స్పోర్ట్స్ : స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాలతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో ఖేలో ఇండియా రైజింగ్ టాలెంట్ ఐడెంటిఫికేషన్ అసెస్‌మెంట్ ద్వారా బుధవారం ప్రత్యేక ఎంపిక ప్రక్రియ చేపడుతున్నట్లు హనుమకొండ డీవైఎస్ఓ అశోక్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా అట్టడుగు స్థాయి క్రీడాకారుల ప్రతిభను వెలికితీసి భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ అత్యున్నత స్థాయిలో ఫీడర్ క్రీడాకారులను సృష్టించడమే ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. 9 నుంచి 18 ఏళ్ల వయస్సు లోపు బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు అథ్లెట్ కోచ్ శ్రీమన్నారాయణ 94410 86556 ఫోన్ చేయాలన్నారు.

కేంద్రంలో బీజేపీని గెలిపిస్తేనే వర్గీకరణ సాధ్యం

కమలాపూర్ : పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపిస్తేనే ఎస్సీ వర్గీకరణ సాధ్యపడుతుందని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు రుద్రారపు రామచంద్రం అన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పోడేటి రాజు అధ్యక్షతన మంగళవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్లుగా మంద కృష్ణ మాదిగ ఎస్సీ వర్గీకరణ కోసం అహర్నిశలు కష్టపడ్డారని, ఆయన కష్ట ఫలితంగానే లక్షలాది జనం ఉన్న నిండు సభలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నట్లు ప్రకటించారని తెలిపారు. ఏడుగురు న్యాయమూర్తులతో కూడిన కమిటీని నియమించారని, మోదీపై తమకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. గతంలో ఎస్సీ వర్గీకరణ చేస్తామని కాంగ్రెస్, బీఆర్ఎస్ హామీ ఇచ్చి ఓట్లు దండుకుని ఎన్నికలు అయిపోగానే వర్గీకరణ ఊసే ఎత్తలేదని విమర్శించారు. మాదిగలను మోసం చేసిన ఇరు పార్టీలను ఓడించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు వసంత్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానకార్యదర్శి రాజు, ఎంఎస్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్, మండల అధ్యక్షుడు ప్రసాద్, రవీందర్, బీజేపీ నాయకుడు శోభన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రామచంద్రం

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ మోసం



శాయంపేట : మాట్లాడుతున్న గండ్ర జ్యోతి



ఐనవోలు : మాట్లాడుతున్న రాజయ్య

శాయంపేట : అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన ఆరు గ్యారంటీను అమలు చేయడంలో విఫలమైందని, పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి మోసం చేసేందుకు చూస్తుందని జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని గట్లకానిపర్తి, కొత్తగట్టుసింగారం, మాందారిపేట గ్రామాల్లో మంగళవారం ఉపాధి హామీ కూలీలతో మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌కు ఓటు వేసి గెలిపించాలని కూలీలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓటుతో గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. తెలంగాణ హక్కుల కోసం పార్లమెంట్‌లో పోరాడాలంటే బీఆర్ఎస్‌తోనే సాధ్యమని అన్నారు.

బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి

ఐనవోలు : బీఆర్ఎస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని మాజీ ఉప ముఖ్యమంత్రి తాటికొండ రాజయ్య అన్నారు. మంగళవారం మండలంలోని గర్మిళ్లపల్లిలో ముఖ్య నాయకులను బీఆర్ఎస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి మారెపల్లి సుధీర్‌కుమార్‌తో కలిసి మాట్లాడారు. కార్యకర్తల కష్టార్జితంతో గెలిచిన కడియం శ్రీహరి ముందుగా ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గుంటూరు కోడలు కావ్యకు ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. తెలంగాణ ఉద్యమ బిడ్డ వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.



పరకాల : మాట్లాడుతున్న చల్లా ధర్మారెడ్డి

పదేళ్ల అభివృద్ధిని సామాధి చేసిన కాంగ్రెస్

పరకాల : పదేళ్ల అభివృద్ధి, సంక్షేమాన్ని వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం సమాధి చేసిందని పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ధ్వజమెత్తారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ మారేపల్లి సుధీర్‌కుమార్‌ను గెలిపించాలని కోరుతూ పరకాల మండలంలోని పోచారం, కామారెడ్డిపల్లె, అలియాబాద్, వెల్లంపల్లి, వెంకటాపూర్, లక్ష్మీపూర్, హైబోతుపల్లి, పైడిపల్లి, నాగారం గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించి మాట్లాడారు. మోసపూరిత హామీలిచ్చి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని ఆరోపించారు. ప్రజల గోసకు కారణమైన కాంగ్రెస్‌కు పార్లమెంట్ ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు.

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావ్యను గెలిపించాలి



ఐనవోలు : మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు



వేలేరు : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే శ్రీహరి



ఐనవోలు : మాట్లాడుతున్న కడియం కావ్య

ఐనవోలు : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అమలు చేయబోయే 5 న్యాయాలు, 25 పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ ఎంపీ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కార్యకర్తలకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఫంక్షన్‌హాల్‌లో మండలంలోని బూత్ ఇన్‌చార్జ్‌లు, కన్వీనర్లు, ముఖ్య నాయకులతో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్యతో కలిసి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పార్టీలో కొత్త, పాత అనే తేడాలేకుండా నాయకులు సమిష్టిగా కృషిచేసి కడియం కావ్యను పార్లమెంట్ ఎన్నికల్లో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం కడియం శ్రీహరి మాట్లాడుతూ.. 2016లో ఐనవోలు మండలం ఏర్పడిన సందర్భంలో తాను డిప్యూటీ సీఎం హోదాలో మండలాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేసినట్లు గుర్తుచేశారు. మండలంలో కస్తూర్బా పాఠశబూల ఏర్పాటు చేశానని, ప్రస్తుతం ఇంటర్‌మీడియట్ వరకు విద్య అందుతుండగా డిగ్రీ కళాశాలగా మారుస్తామని హామీ ఇచ్చారు. ఐనవోలు ఆలయాన్ని కూడా గతంలో అభివృద్ధి చేశామన్నారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఎన్నికల్లో గెలుపొందడంతో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు పిచ్చి లేసి ఇష్టారీతిన మాట్లాడుతున్నాడని విమర్శించారు. వందల ఎకరాలు భూ కబ్జాలు చేసిన బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి అరూరి రమేశ్‌కు మరోసారి మండల ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ అభ్యర్థి కడియం కావ్యను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ వరంగల్ పార్లమెంట్ అభ్యర్థి కడియం కావ్య మాట్లాడుతూ.. వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో 6 సంవత్సరాలు డాక్టర్‌గా పనిచేశానని గుర్తు చేశారు. కడియం ఫౌండేషన్ ద్వారా మహిళలకు సేవలు అందించానని గుర్తుచేశారు. అరూరి రమేశ్ అవినీతి చిట్టా తనకంటే మండల ప్రజలకే ఎక్కువగా తెలుసన్నారు. అలాంటి వ్యక్తి ఎంపీగా గెలిస్తే ఆయన అరాచకాలకు అడ్డు ఉండదన్నారు. మే 13న జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, పార్లమెంట్ కో ఆర్డినేటర్ కుందూరు వెంకటరెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి నిమ్మాని శేఖర్‌రావు, ఎంపీపీ మార్నేని మధుమతి, డాక్టర్ పులి అనిల్‌కుమార్, తిరుపతి, రాజిరెడ్డి, మహేందర్, బండి సుధాకర్, బాబురావు, వెంకటేశ్వర్‌రావు, బుచ్చిరెడ్డి, సాంబయ్య, మండల, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

కేంద్రంలో కాంగ్రెస్ వస్తేనే యువతకు ఉపాధి

వేలేరు : కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగ, ఉపాధికల్పన లభిస్తుందని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నాయకులు మంగళవారం మాజీ సర్పంచ్ విజయపురి మల్లికార్జున్ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరగా ఆయన కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కడియం శ్రీహరి మాట్లాడుతూ.. కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతీ కార్యకర్త సైనికుడిలా పని చేయాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పాత, కొత్త అనే తేడా లేకుండా నాయకులు కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండే వరంగల్ ఎంపీ అభ్యర్థి కడియం కావ్య గెలుపు కోసం కృషి చేయాలని నాయకులకు సూచించారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వర్తించాలి

ఆత్మకూరు : ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఎన్నికల అబ్జర్వర్ భండారి స్వాగత్ రణ్వీర్‌చంద్ అన్నారు. కటాక్షపూర్ చెక్‌పోస్ట్, నీరుకుళ్ల, అక్కంపేట పోలింగ్ కేంద్రాలను మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని ప్రతిఒక్కరూ పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ కిశోర్ కుమార్, సీఐ క్రాంతికుమార్ పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న రణ్వీర్‌చంద్

‘కడియం’ నయవంచకుడు

వేలేరు : ఎమ్మెల్యే కడియం శ్రీహరి నయవంచకుడని బీజేపీ ఎంపీ అభ్యర్థి అరూరి రమేశ్ విమర్శించారు. మంగళవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీహరి అసెంబ్లీ ఎన్నికల్లో కల్లిబొల్లి మాటలు చెప్పి గెలిచారని అన్నారు. గెలిపించిన కార్యకర్తలను నట్టేటముంచి తన బిడ్డ భవిష్యత్ కోసం కాంగ్రెస్‌లో చేరాడని ఆరోపించారు. అధికార కాంగ్రెస్ పార్టీ హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. ఆరు గ్యారంటీలు అమలు చేయకుండానే మళ్లీ ఓట్లు అడగడం సిగ్గుచేటన్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, విజయరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అరూరి రమేశ్

’మెపా’ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ తరగతులు

హన్మకొండ : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోషియేషన్ తెలంగాణ ఆధ్వర్యంలో పేద పిల్లలకు ఉచిత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు అసోషియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ తెలిపారు. మంగళవారం హనుమకొండలోని మెపా-టీ కార్యాలయంలో అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదో తరగతి ఆ కింది స్థాయి పిల్లలకు అబాకస్- గణితం , ఆంగ్ల పఠనంతో పాటు వ్యక్తిత్వ వికాసంపై తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉచిత శిక్షణ తరగతులు మే 1 నుంచి 31 వరకు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు హనుమకొండ నక్కలగుట్టలోని వివేకానంద పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు వివరించారు. అసక్తి గల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఆసక్తిగల వారు వివరాల కోసం 9951193673 నంబర్‌తో పాటు మెపా రాష్ట్ర కమిటీ సభ్యులను సంప్రదించాలన్నారు. సమావేశంలో శ్రీనివాస్, పృథ్వీ, సంతోష్, సురేష్, రాకేష్‌తో పాటు , తదితరులు పాల్గొన్నారు.